క్లుప్తంగా

రూ. 3.10 కోట్ల లాభాల్లో టౌన్ బ్యాంకు



మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్

గుత్తి: అధికారులు, సిబ్బంది, ఖాతాదారుల కృషి ఫలితంగా టౌన్ బ్యాంకు లాభాల్లో పయనిస్తోంది. ప్రస్తుతం బ్యాంకు రూ. 3.10 కోట్ల లాభాల్లో ఉందని కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ప్రెసిడెంట్ అబ్దుల్ జిలాన్, సీఈఓ మహేశ్వర ప్రసాద్ అన్నారు. గుత్తిలోని వసుధ ఫంక్షన్ హాల్లో ఆదివారం బ్యాంకు సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఖాతాదారులకు రుణాలు విరివిరిగా ఇస్తున్నామన్నారు. వడ్డీ రేట్లు కూడా చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ఇటీవల అనంతపురంలో ఓపెన్ చేసిన టౌన్ బ్యాంకు బ్రాంచ్‌లో ఆరు కోట్లు డిపాజిట్లు వచ్చాయన్నారు. జిల్లాలో మరో మూడు బ్రాంచ్‌లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు రాము, డైరెక్టర్లు కృష్ణ, నాగరాజు, అంగడి నాగరాజు, వీరన్న, మాబు, దాదు, వెంకి, మధు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ సేవాసమితి ఏర్పాటు

గుంతకల్లుటౌన్: యువతలో దేశభక్తిని పెంపొందించడంతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే లక్ష్యంతో ఆజాద్ సేవాసమితిని ఏర్పాటు చేసినట్లు ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్డే రమేష్ తెలిపారు. ఆదివారం ఇల్లూరు భవన్‌లో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆజాద్ సేవాసమితి గౌరవ అధ్యక్షుడిగా బండి మురళి, వ్యవస్థాపక అధ్యక్షుడిగా వడ్డే రమేష్, ప్రధాన కార్యదర్శిగా వి.ప్రభాకర్, కార్యదర్శిగా మాబు, కోశాధికారిగా వి.మోహన్, తదితరులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

గుత్తి జట్టు విజయం



విజేతగా నిలిచిన గుత్తి మున్సిపల్ జట్టు

గుత్తి: తాడిపత్రిలో ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమంలో భాగంగా తాడిపత్రి– గుత్తి మున్సిపల్ జట్ల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన తాడిపత్రి జట్టు నిర్ణీత ఓవర్లలో కేవలం 72 పరుగులు సాధించి ఆలౌట్ అయ్యారు. అనంతరం 73 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుత్తి మున్సిపల్ జట్టు కేవలం ఐదు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. గుత్తి జట్టు కెప్టెన్ అయిన మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాతో పాటు జట్టులోని క్రీడాకారులందరికీ నిర్వాహకులు బహుమతులు, షీల్డ్ అందజేశారు.

ఆలయ వార్షికోత్సవం



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న స్వాములు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని కడప రోడ్డులో ఉన్న శ్రీ శైల భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయంలో 16వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు కార్యక్రమాలను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. 16న ఉదయం అఖండ దీపారాధన, కలశ స్థాపన, గోపూజ, భగవద్గీత సామూహిక పారాయణం, 108 దంపతులచే హోమం నిర్వహించారు. ఉదయం, సాయంత్ర వేళల్లో పీఠాధిపతులు కృష్ణచరణానంద భారతీ స్వాములు, చిన్మాయా మిషన్‌కు చెందిన విరాజ చైతన్య మాతాజి, సుధీరానంద సరస్వతిస్వామిల అధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

రైల్వే స్టేషన్‌లో కోచ్ ఇండికేషన్‌ల ఏర్పాటు

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆదివారం కోచ్ ఇండికేషన్‌ల పనులు ప్రారంభమయ్యాయి. రెండు ప్లాట్ ఫారాల్లో వీటిని బిగించనున్నారు. ఒక్కొక్క ప్లాంట్ ఫారానికి 24 కోచ్ ఇండికేషన్‌లను ఏర్పాటు చేయనున్నారని స్టేషన్ మాస్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. కోచ్ ఇండికేషన్‌లు లేకపోవడంతో ఎక్కడ ఏ కోచ్‌లు వస్తాయో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. సమస్యలకు చెక్ పెడుతూ కోచ్ ఇండికేషన్‌లను ఏర్పాటు చేయడం పట్ల ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా




హనుమాన్ చాలీసాలో పాల్గొన్న భక్తులు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఏటిగడ్డ పాలెంలో ఆదివారం సామూహిక హనుమాన్ చాలీసా పఠించారు. వ్యాసరాయ ప్రతిష్టిత ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన హనుమాన్ చాలీసా కార్యక్రమానికి భక్తులు హాజరయ్యారు. అంతకుముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

అందని ద్రాక్షలా బీసీ రుణాలు

మండలం: గుంతకల్లు
బీసీ రుణాల యూనిట్లు: 35
దరఖాస్తులు: సుమారు 580



● అడుగడుగునా రాజకీయ జోక్యం ● ఆశలు వదులుకున్న సామాన్యులు

గుంతకల్లు రూరల్: నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మంజూరు చేయనున్న బీసీ రుణాలు అందని ద్రాక్షలా మారాయి. 39 గ్రామాలు ఉన్న గుంతకల్లు మండలానికి కేవలం 35 బీసీ రుణాలను మాత్రమే కూటమి ప్రభుత్వం మంజూరు చేయడం, దానికితోడు దరఖాస్తుల ప్రక్రియ మొదలైన నాటి నుంచే రుణాల పంపిణీపై రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోవడంతో.. అర్హతలున్న సామాన్యులు ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎన్నికలకు ముందు ఇబ్బడి ముబ్బడిగా హామీలను గుప్పించి అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల పదవీ కాలంలో పింఛన్ల పెంపు పథకాన్ని తప్పితే మరే ఇతర పథకాన్ని అమలు చేసిన పాపాన పోలేదు. ఏడాదికి మూడు సిలెండర్లు ఉచిత గ్యాస్ హామీ పథకాన్ని అమలు చేసినట్లు ప్రభుత్వం ఊదర గొడుతున్నా సబ్సిడీ నగదు తమ ఖాతాల్లో జమకావడం లేదంటూ అధికారులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరగలేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేమంటూ కూటమి ప్రభుత్వం చేతులెత్తేస్తున్న తరుణంలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో బీసీ రుణాలను మంజూరుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే గుంతకల్లు మండలానికి 35 బీసీ రుణాలు, ఎకనామికల్లీ బ్యాక్‌వర్డ్ జనరల్ –2, బ్రాహ్మిణ్ –1, రెడ్డి–1, కమ్మ–1 కలిపి మొత్తం 5 రుణాలు, కాపులకు మరో 10 రుణాలు మంజూరయ్యాయి. 25 గ్రామ పంచాయతీలు, 39 గ్రామాలు ఉన్న గుంతకల్లు మండలానికి కేవలం 35 బీసీ రుణాలను మాత్రమే మంజూరు చేయడంతో ప్రభుత్వ తీరుపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతి గ్రామానికి 10 నుంచి 15 రుణాల వరకూ మంజూరు అయ్యేవని, కానీ ఈ సారి గ్రామానికి ఒక రుణం కూడా మంజూరు అయ్యే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు

యూనిట్ విలువ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఉన్న ఈ రుణాలను దక్కించుకునేందుకు అధికార పార్టీ కార్యకర్తలు గత పది రోజులుగా పార్టీలో పలుకుబడి ఉన్న నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలు అంతంత మాత్రంగానే ఉండటం, ఈ రుణాలను దక్కించుకునేందుకు అధికార పార్టీ కార్యకర్తలు, నాయకులే భారీ ఎత్తున పోటీ పడుతుండటంతో వారిని దాటుకుని రుణాలు మా వరకూ రావడం అసాధ్యం అని గమనించిన సామాన్యులు ఉసూరుమంటూ ఊరుకుండిపోతున్నారు. ప్రయత్నం చేస్తే పోయేదేముందని భావించిన మరికొంతమంది దాదాపు రూ.500 వరకూ ఖర్చు చేసి బీసీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. దాదాపు 25 వేలకు పైగా బీసీ జనాభా కలిగిన గుంతకల్లు మండలంలో బీసీ రుణాల కోసం 580 మందికి పైగా మాత్రమే దరఖాస్తు చేసుకున్నారంటే అధికార పార్టీ పలుకుబడి చూసి రుణాల దరఖాస్తుకు వెళ్లకుండా నిలిచిపోయిన బీసీలు ఎంతమంది ఉంటారో ఇట్టే అర్థం అవుతుంది.

గ్రామానికి 20 యూనిట్లు మంజూరు చేయాలి



గుంతకల్లు మండలానికి కేవలం 35 యూనిట్ల బీసీ రుణాలను మంజూరు చేశారు. జనాభా ప్రాతిపదికన కాదు కదా గ్రామాల ప్రాతిపదికన చూసుకున్నా మండలంలో ఒక గ్రామానికి ఒక్క యూనిట్ కూడా అందే అవకాశం లేదు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్న ఎంతోమంది నిరుద్యోగులు అవస్థలు పడుతున్న ప్రస్తుత తరుణంలో స్వయం ఉపాధి రుణాల పేరుతో మండలానికి కేవలం 35 రుణాలను మంజూరు చేయడం సరికాదు. – లాలిరెడ్డి, నిరుద్యోగి, కసాపురం

రుణాల సంఖ్యను పెంచాలి



జిల్లాలో బీసీలు ఎక్కువశాతం మంది ఉన్నారు. ఆర్థిక వనరులు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో మాలాంటి నిరుద్యోగ యువకులు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందుతు పడుతున్నారు. ఈ క్రమంలో స్వయం ఉపాధిని కల్పించేందుకు బీసీ రుణాలను మంజూరు చేసిన ప్రభుత్వం గుంతకల్లు మండలానికి కేవలం 35 రుణాలను మంజూరు చేయడం దారుణం. ఈ సంఖ్యను వెంటనే పెంచి ప్రతి గ్రామానికి 15 నుంచి 20 మందికి రుణాలు మంజూరు చేయాలి. – వీరాంజనేయులు, నిరుద్యోగి, నెలగొండ

వైవీఆర్‌ను పరామర్శించిన 'అనంత'



వైవీఆర్‌తో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సర్వైకల్ సర్జరీ చేయించుకుని గుంతకల్లుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ఆదివారం సాయంత్రం వైవీఆర్ నివాసానికి విచ్చేసి ఆరోగ్యం గురించి ఆరాతీశారు. అనంతరం వారు నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా అనంతను స్థానిక పార్టీ నాయకులు కలిశారు. పార్టీ నిర్వహించనున్న ప్రజాపోరాటాల్లో ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొనాలని, పార్టీని మరింత బలోపేతం చేయడానికి పాటుపడాలని అనంత వెంకటరామిరెడ్డి వారికి సూచించారు.

భోగేశ్వరాలయంలో పూజలు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం భోగభాగ్యాలిచ్చే భోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మూలవిరాట్ భోగేశ్వరుని, ప్రసన్న పార్వతీ దేవి విగ్రహాన్ని శోభాయానంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రాశర్మ, అనిల్‌కుమార్ వేద మంత్రోచ్చారణల నడుమ ఆదిదంపతులు శివ పార్వతులకు విశేష పూజలు చేశారు. గణపతి దుర్గా సహిత రుద్రస్వాహాకార హోమం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే సోమవారం మాఘ బహుళ పంచమిని పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి తిరునాల



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



స్వామివారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హారతి ఇస్తున్న ప్రధాన అర్చకుడు రామాచార్యుడు

గార్లదిన్నె: మండలంలోని కోటంక గ్రామంలో కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాల మాఘమాసం మూడో ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శనివారం రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగిస్తూ స్వామి వారి సన్నిధికి చేర్చారు. ఆదివారం తెల్లవారుజామున శ్రీవారికి మహాన్యాసపూర్వక, ఏకవార రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంత్ర పుష్పం, మంగళహారతి గావించి సుబ్రమణ్యస్వామికి, వల్లిదేవతలకు వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అలాగే స్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అదేవిధంగా 108 శివలింగాల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేశారు. అలాగే మూలవిరాట్ వద్ద ఉన్న నీటిని భక్తులు బాటిళ్లలో తీసుకుని భక్తి శ్రద్ధలతో సేవించారు. ఇలా చేయడం వల్ల సకల రోగాలు నివారణ అవుతాయని ప్రజల నమ్మకం. భక్తుల కొంగుబంగారమైన సుబ్రమణ్యస్వామి తిరునాలకు ఎద్దులబండ్లు, ట్రాక్టర్లతో వచ్చి బానం వండి తలనీనాలు సమర్పించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి, శ్రీవల్లి, దేవసేన విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద ధ్వజ స్తంభం నిర్మాణ దాత మోదుపల్లి సుబ్బయ్య భక్తుల సౌకార్యర్థం అన్నదానం చేశారు. తిరునాల సందర్భంగా గాజుల అంగళ్లు, తినుబండారాలు, చెరకు, బొరుగుల అంగళ్లు కిటకిటలాడాయి. భక్తుల సౌకార్యార్థం అనంతపురం నుంచి కోటంక దేవస్థానం వరకూ ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

సంక్షిప్త సమాచారం

రైతులకు ఐడీ నెంబర్లు

యల్లనూరు: ప్రభుత్వం నూతన విధానం ద్వారా రైతులకు ఐడీ నెంబర్లు జారీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రామకృష్ణుడు తెలిపారు. అయన మాట్లాడుతూ ఈ నెంబరు ద్వారా రైతన్నలకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు, సబ్సిడీ పథకాలు మంజూరు, ప్రభుత్వ రాయితీలు చెల్లింపులు ఉంటాయన్నారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకెళ్లి ఐడెంటిటీ నెంబరును నమోదు చేయించుకోవాలన్నారు.

స్కార్పియో దగ్ధం

తాడిపత్రి రూరల్: మండలంలోని యర్రగుంటపల్లి వద్ద ఆదివారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో స్కార్పియో వాహనం దగ్ధమైందని ఫైర్ అధికారులు తెలిపారు. అనంతపురానికి చెందిన నీలకంఠారెడ్డితో పాటు మరి కొందరు వ్యక్తిగత పనుల నిమిత్తం కడపకు వెళ్లారు. అనంతపురానికి తిరిగి వస్తుండగా యర్రగుంటపల్లి వద స్కార్పియోలో నుంచి పొగలు రావడంతో వారు బయటకు వచ్చారు. కొద్ది సేపటికి మంటలు వ్యాపించాయి. ఫైర్ అధికారులు వెళ్లి మంటలను ఆర్పేలోగా వాహనం పూర్తిగా కాలిపోయింది.

ఇంట్లో చోరీ

తాడిపత్రి రూరల్: మండలంలోని ఇగుడూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో దొంగలు చొరబడి రూ.75 వేలను ఎత్తుకెళ్లారని బాధితురాలు పుష్పలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. పదేళ్ల క్రితం భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఇంటికి తాళం వేసి నార్పల మండలం కర్ణపాడి గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లింది. ఇదే అదనుగా దొంగలు ప్రవేశించి బీరువాలోని నగదును ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

పుట్లూరు: మండలంలోని ఓబుళాపురం–కడవకల్లు రోడ్డు సమీపంలో పేకాట జూదకేంద్రంపై ఆదివారం దాడులు చేసినట్లు ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు. ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.32,260 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బుక్కరాయసముద్రం: మండలంలోని గుత్తి రోడ్డు చెలమారెడ్డి ఫంక్షన్ హాలు సమీపంలో అనంతపురం –గుత్తి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. బొమ్మలాటపల్లికి చెందిన కిష్టప్ప సోములదొడ్డి వైపు నుంచి అనంతపురానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. ప్రమాదంలో కిష్టప్పకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమెదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సింగరప్ప స్వామి తిరునాల



అలంకరణలో సింగరప్పస్వామి

గార్లదిన్నె/పామిడి: గార్లదిన్నె మండలంలోని కల్లూరులో క్షేత్రపాల కొండపై వెలసిన సింగరప్పస్వామి తిరునాల ఆదివారం వైభవంగా నిర్వహించారు.ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. పామిడిలోని భోగేశ్వరాలయ ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు అనిల్‌కుమార్, చంద్రాశర్మ తదితరుల మంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు చేశారు. ఈసందర్భంగా సింగరప్ప కొండకు భక్తులు పోటెత్తారు. పెన్నానది ఊటకాలువలో పుణ్యస్నానాలు స్నానాలు ఆచరించి మహాశివుడిని దర్శించుకున్నారు. మాఘమాసం మూడో ఆదివారం ఈ కొండకు చుట్టుప్రక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించడం ఆనవాయితీ.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



మాట్లాడుతున్న సీపీఐ నేత జగదీష్

గుంతకల్లు రూరల్: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ విమర్శించారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వామపక్ష పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులు, వ్యవసాయ కూలీలు, విద్య, వైద్యం, అసంఘటిత కార్మిక రంగానికి మొదలగు వారికి ఎటువంటి బడ్జెట్ కేటాయింపులు చేపట్టలేదన్నారు. ఆయా వర్గాలకు జరిగిన అన్యాయాన్ని ప్రజలందరికీ తెలిసేలా వామపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ రెడ్డి, సీపీఎం, సీపీఐ పార్టీల జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, వివిధ వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



గుంతకల్లులో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు



గుత్తిలో శ్రీకృష్ణ దేవరాయల జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



యాడికిలో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్/గుంతకల్లు రూరల్/గుత్తి/యాడికి: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో ఆదివారం విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుంతకల్లులోని రాయల సర్కిల్‌లో ఉన్న కృష్ణదేవరాయల వారి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పూలరమణ, గోవింద రాజులు, కోశాధికారి సంజీవరాయుడు, ఉపాధ్యక్షులు మునీశ్వరప్ప, సుబ్బయ్య, ఉమా, వనజ, స్రవంతి, శ్రీదేవి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే బలిజ సంఘం నాయకులు అనురాగ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అంతకుముందు రాయలవారి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విశ్వనాథ్, మణికంత, రాయల్‌రంగా, బెల్లంరాజు, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

– గుత్తిలో బలిజ సంఘం అధ్యక్షుడు బండి సత్య ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు నిర్వహించారు. బలిజ సంఘం మాజీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రమేష్ బాబు, నాయకులు అరుణ్ రాయల్, నాగరంగ ప్రసాద్, నరేష్ రాయల్, పసుపులేటి సురేష్, హేమలత, శ్రీదేవి, రంగడు, ఎర్రిస్వామి, మధు, రామాంజి, నారాయణస్వామి, నరసింహ,ప్రసాద్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బలిజ సంఘం మరో వర్గానికి చెందిన మారాకుల రమణ, శ్రీకరం వెంకటేష్, మంజు, రాము, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు నిర్వహించారు.

– యాడికిలో కృష్ణ దేవరాయల జయంతి వేడుకలను బలిజలు ఘనంగా నిర్వహించారు. బలిజ సంఘం అధ్యక్షుడు హరి, రాయుడు, నారాయణ స్వామి, రామాంజి,శ్రీనివాసులు, జగదీస్, సురేష్, గిరి, కంబగిరి రాయుడు, భీమారావు,చిన్న , కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

గుంతకల్లు రూరల్/పామిడి: గుంతకల్లు మండలంలోని వైటీ.చెరువు గ్రామంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆర్థోపెడిక్ సర్జన్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో దాదాపు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేశారు. కావలి రామకృష్ణ సౌజన్యంతో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరంలో రోటరీ క్లబ్ ప్రసిడెంట్ శివానంద, సెక్రెటరీ శ్రీనివాసులు ఇతర సభ్యులు పాల్గొన్నారు. అలాగే పామిడి పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వైద్యురాలు నేహ 250 మందికి కంటి పరీక్షలు చేసి, 68 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం రోగులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాప అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతి నాయుడు, క్లబ్ ప్రెసిడెంట్ రఘువీర్, ఉపాధ్యక్షుడు పత్రా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి పీసే జయరామ్‌రావు, వైద్యులు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లు రైల్వే స్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



నాగసముద్రం జిల్లా పరిషత్ పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంతకల్లు రూరల్: గుంతకల్లు రైల్వే హైస్కూల్‌లో ఆదివారం 1983–84 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి విశేష కృషి చేసిన డాక్టర్ జానీ, లాయర్ రాజశేఖర్‌ను అందరూ అభినందించారు.

గార్లదిన్నె: మండలంలోని క్రిష్టాపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం 2014–15 విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్దరాజు, సురేష్, రుషేంద్ర, ఎర్రిస్వామి, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మండలంలోని నాగసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు.



క్రిష్టాపురంలో పూర్వ విద్యార్థుల కలయిక